ఇంటింటా ఆరోగ్య సురక్ష

- కొత్త ప్రథకానికి ప్రభుత్వం శ్రీకారం
- 15 నుంచి ఇంటింటి సర్వే... రోగుల గుర్తింపు
- 30 నుంచి స్పెషలిస్ట్ వైద్యులతో మెగా వైద్యశిబిరాలు


తుమ్మలపెంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



విలేజ్ హెల్త్ క్లీనిక్

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. ప్రజల చెంతకే వైద్య సేవలు అందజేస్తుంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ పేరుతో పీహెచ్‌సీలకు చెందిన మెడికల్ ఆఫీసర్లు గ్రామాల్లో రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తుండడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు–నేడు పథకం కింద పీహెచ్‌సీలను ఆధునకీకరించి సరికొత్త వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటే అన్నీ పీహెచ్‌సీల్లో 14 మంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా పోస్టులు మంజూరు చేసింది ప్రభుత్వం. ఈనెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. స్పెషలిస్టు వైద్యులతో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. జగనన్న ఆరోగ్య రక్ష పేరుతో 45 రోజుల పాటు ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

29 వరకు ఇంటింటి సర్వే

గ్రామాలు, పట్టణాల్లో సైతం ఈనెల 15నుంచి 29వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. మొదట వలంటీర్లు తమ 50 ఇళ్ల పరిధిలోని కుటుంబాల సభ్యులకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గురించి వివరిస్తారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్తారు. ఆయా కుటుంబాలలో అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే గుర్తించి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. వారికి ఏమైనా పరీక్షలు అవసరమైతే నిర్వహిస్తారు. చికిత్స అందించాల్సి ఉంటే వారిని ఆ గ్రామంలో ఎప్పుడు వైద్యశిబిరం నిర్వహిస్తారో సమాచారం అందజేస్తారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సమయంలో వైద్య సేవలు పొందేలా చేస్తారు.

30 నుంచి వైద్యశిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా మండలానికి ఒక గ్రామంలో చొప్పున మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తారు. ఈవైద్య శిబిరాలలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు వైద్య సేవలు అందజేస్తారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహన వైద్యుడితో పాటు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ కేంద్రంగా ఈవైద్యశిబిరాలను నిర్వహిస్తారు. వైద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో వైద్యశిబిరాల రూట్‌మ్యాప్ ఖరారు చేశారు.

చికిత్స అవసరమైతే:

గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే వైద్యశిబిరాల్లో స్పెషలిస్టు వైద్యుల పరీక్షలు పూర్తయ్యాక అవసరం మేరకు ఆసుపత్రిలో చేర్పిస్తారు. రోగులకు ఉన్న వ్యాధి మేరకు ఆయా నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలిస్తారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు. రోగులకు పైసా ఖర్చు లేకుండానే వైద్యం అందించేందుకు వైద్యశాఖ అన్ని చర్యలు తీసుకుంటుంది. అవసరమైతే శస్త్ర చికిత్సలు చేస్తారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వైద్య శిబిరాలకు అవసరమయ్యే కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–రాజ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, కొలిమిగుండ్ల

లక్ష్యాన్ని అధిగమించాలి

కోవెలకుంట్ల: 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద నిర్దేశించిన పనుల లక్ష్యాన్ని అధిగమించాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులు అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మామిడి, చీని, సపోట, నిమ్మ, దానిమ్మ, తదితర 25 రకాల పండ్లతోటల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు.

రైల్వే గేట్‌ను ఢీ కొట్టిన బోలెరో

డోన్ రూరల్ : మండల పరిధిలోని వెంకటనాయునిపల్లి గ్రామం వద్ద ఉన్న రైల్వే గేట్‌ను బొలెరో వాహనం బుధవారం అతివేగంతో వచ్చి ఢీకొన్న సంఘట చోటు చేసుకుంది. డోన్ మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన షేక్‌నభీ అనే బోలెరో డ్రైవర్ తన బంధవుల ఇంటికి వెంకటనాయునిపల్లి గ్రామానికి వచ్చారని గ్రామస్తులు తెలిపారు. సొంత గ్రామానికి వెళ్లే సమయంలో వాహనంతో రైల్వే గేట్లను ఢీ కొట్టాడు. దీంతో రైల్వే గేట్ పూర్తిగా విరిగి కిందపడిందన్నారు. వాహనం అదుపు తప్పి పొలాల్లోకి తీసుకెళ్లిందని చెప్పారు. డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పారిపోయడన్నారు. డ్రైవర్‌పై కర్నూలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

హెల్త్ స్కీం డిస్పెన్సరీ ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని


డిస్పెన్సరీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఎంప్లాయిస్ హెల్త్ స్కీం డిస్పెన్సరీ, ఆయుష్మాన్‌భవ వైద్యసేవలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగాలు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం డిస్పెనరీ లేకపోవడంతో కర్నూలు, నంద్యాల వైద్యశాలలకు వెళ్లాల్సివచ్చేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ మిత్ర సిబ్బంది వైద్యశాలలో సక్రమంగా అందుబాటులో ఉండడంలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. హెల్త్‌స్కీం పథకంలో ఉద్యోగులకు అందించే వైద్యసేవలను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూజతతో పాటు ఇతర వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో సంఘం నియోజవర్గ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సెక్రటరీ అల్తాహుస్సేన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ నిరంజన్, వైద్యులు లలిత, మంగ్యానాయక్, శైలజ, జగదీశ్వర్‌రెడ్డి, ఉమాదేవి, కళ్యాణి, జనార్ధన్, చిన్నలింగన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

బేతంచెర్ల: పట్టణంలోని పోలింగ్ బూత్‌లను బుధవారం డీటీ సత్యదీప్, బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లతో కలిసి తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. బూత్‌లలో సౌకర్యాలు, చేర్పులు, మార్పులు, లోకేషన్ తదితర వాటిని పరిశీలించారు. మండలంలోని 86 పోలింగ్ బూత్‌లకు గాను ఒక్కొ పోలింగ్ బూత్‌లో 1500 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పెద్దరాజు స్వామి గంధం వేడుకలు

- తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడిన గూటుపల్లె
- ఆకట్టుకున్న పకీర్ల సాహస కృత్యాలు


శరీరంపై ఇనుప చువ్వలు గుచ్చుకున్న పకీర్


పెద్ద రాజు స్వామికి గంధం సమర్పిస్తున్న పీఠాధిపతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లెలో వెలసిన పెద్ద రాజు స్వామి (హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్ బాషా) ఉరుసు వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సాగుతున్నాయి. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో గూటుపల్లె కిటకిటలాడుతుంది. ఉరుసు వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామును దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి, దర్గా నిర్వాహకులు గురుసయ్యద్ షా బాషా ఖాద్రి ఆధ్వర్యంలో పెద్దరాజు స్వామి దర్గాకు గంధం సమరించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అంతకుముందు దర్గా పీఠాధిపతి ఇంటి నుంచి గంధం మహోత్సవం బయలు దేరగా భక్త జనసందోహం, మేళతాళాలు, వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. కర్ణాటక, బెల్గం, బీజాపూర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పకీర్ల సాహస కృత్యాల ఆశ్చర్యపరిచాయి. కోవెలకుంట్లకు చెందిన ఇనాందారుల నాట్యాలు ఆకట్టుకున్నాయి. గంధం మహోత్సవం అనంతరం దర్గా పీఠాధిపతిని గ్రామ పురవీధుల గుండా గుర్రంపై ఊరేగించారు. దర్గా సందర్శనకు వచ్చిన భక్తులకు దర్గా నిర్వాహకులతో పాటు పెంచికలపాడుకు చెందిన దాతలు అన్నదానం చేశారు.

అభివృద్ధిలో అగ్రగామి డోన్ నియోజకవర్గం


గోరుకల్లు రిజర్వాయర్ వద్ద మున్సిపల్ పాలకవర్గ సభ్యులు


వాటర్ గ్రిడ్ పనులను వివరిస్తున్న ఇంజనీర్ వాసు

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీ మేరకు నాలుగేళ్లలో అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల బృందం అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్యాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.320 కోట్లతో నియోజకవర్గానికి తాగు నీటిని అందించే వాటర్ గ్రిడ్ పనులు, రూ.180కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి నియోజకవర్గంలోని చెరువులను నింపే పనులు తదితర అభివృద్ధి పనులు పరిశీలించారు.

రూ. 2300 కోట్లతో అభివృద్ధి పనులు

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ నియోజక వర్గంలో రూ. 2300 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శ్రీరాములు, రేగటి రాజశేఖర్ రెడ్డి, బద్దల రాజ్‌కుమార్, సప్తశైల రాజేష్ తెలిపారు. చెరువలను నింపడం ద్వారా 10 వేల ఎకరాలకు సాగు నీరు, రూ.320 కోట్లతో ఇంటింటికీ మంచినీరు అందించే వాటర్ గ్రిడ్ పనులను చేపట్టి మంత్రి అపర భగీరథుడు అయ్యారన్నారు. రూ.20 కోట్లతో ఫోర్ట్ కోర్టు సముదాయం, రెవెన్యూ డివిజన్, యస్సీ బాలికలు, బీసీ బాలురు రెసిడెన్సియల్ స్కూల్స్, పాలిటెక్నిక్ కళాశాలలు, గొర్రెల పెంపకం శిక్షణా కేంద్రం, ఉర్దూ స్కూల్, షాదీఖానాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, అతి పురాతన దేవాలయాల పునర్ నిర్మాణం, టీటీడీ కళ్యాణ మండపాలు, ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జీలు, సర్వీస్ రోడ్లు నిర్మాణాలు జరిగాయన్నారు.

డోన్‌కే తలమానికం:

రూ.43 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి డోన్‌కే తలమానికం కానుందని మున్సిపల్ చైర్మన్ రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్, బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తెలిపారు. ఆసుపత్రిలో 16 రకాల విభాగాలను ఏర్పాటు చేసి అన్నిరోగాలకు చికిత్సలు, శస్త్రచికిత్సలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. నూతన ఆసుపత్రిలో కల్పించిన వసతుల గురించి వైద్యులు పాలకవర్గ సభ్యులకు వివరించారు.

అక్టోబర్ చివరకు బేతంచెర్ల మండలానికి తాగు నీరు

అక్టోబర్ నెల చివరి నాటికి బేతంచెర్ల మండలంలోని అన్ని గ్రామాలకు ఇంటింటికీ తాగునీరు అందిస్తామని వాటర్ గ్రిడ్ పనులను చేపడుతున్న మెఘా కంపెనీకి చెందిన ఇంజనీర్ వాసు తెలిపారు. మిగిలిన మండలాలకు సంబంధించి పనులు మరో 2 నెలల్లో పూర్తవుతాయన్నారు.

న్యాయమూర్తిని అగౌరవ పర్చడం మంచిది కాదు


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు నాయుడికి 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పిన జస్టిస్ హిమబిందును అగౌరవ పరుస్తూ టీడీపీ నాయకులు సోషల్ మీడియాల్లో ట్రోల్ చేయడం మంచి పద్ధతి కాదని బీసీ సంఘ నాయకులు కొండయ్యగౌడ్, కిట్టయ్య, కుమార్ ఖండించారు. బుధవారం కొలిమిగుండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందని మహిళా జడ్జిపై అవమానకరంగా దాడి చేయడం సమంజసం కాదన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం విషయంలో బీసీలకు వ్యతిరేకంగా కేంద్ర న్యాయ శాఖకు లేఖ రాసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టే ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలోని పొదుపు భవనంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, ఎంఎల్ హెచ్‌పీలకు సర్వేపై డాక్టర్ శివశంకరుడితోపాటు ఎంపీడీఓ శివరామయ్య సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అవసరం మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యశాలలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందని, సర్వే చేయు ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

మహిళా సంక్షేమానికి సీఎం పెద్ద పీట


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా సంక్షేమానికీ పెద్ద పీట వేసి వైఎస్సార్ ఆసరా, చేయూత, 0వడ్డీ పథకాలను అమలు చేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని కోటపేట కాలనీల్లో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ ఇబ్రహీమ్, చింతల నాగిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో జరిగిన సంక్షేమ పథకాలతో పాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో విద్య, వైద్య రంగాలతో పాటు పట్టణంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాగరాజు, శేఖరయ్య, సలీమ్, ఖాజా, హరి, బ్రహ్మనాయుడు, నజీర్, సునీల్, బుగ్గన భాస్కర్‌రెడ్డి, సద్దాం, అలీబాబా, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

సంజామల: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైస్ ఎంపీపీ చిన్న బాబు సూచించారు. పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం మండలస్థాయి అండర్ –14, 17 బాలురులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఎంపీడీఓ నాగకుమార్, ఎంఈఓ ఈశ్వరయ్యతో కలసి వైస్ ఎంపీపీ ప్రారంభించారు. మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, ఖో–ఖో, వాలిబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్ అథ్లెటిక్స్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మాట్లడుతూ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, విద్యతోపాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీతారావమ్మ, మండల ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ బాషా పాల్గొన్నారు.

బేతంచెర్ల: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంఈఓ సోమశేఖర్ సూచించారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూలు గేమ్స్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, అథ్లెటిక్, యోగా పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్రహం, వ్యాయమ ఉపాధ్యాయులు రంగనాయకులు, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


అమడాలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాలమద్దిలేటి


పింఛన్ నగదు అందజేస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి


లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న దృశ్యం


లబ్ధిదారునికి కొత్త పింఛన్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీదేవి

కోవెలకుంట్ల: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను పేదలందరికీ అందజేస్తోందని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 75 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే సొదరదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆసం మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి ఆధ్వర్యంలో 32 మందికి పింఛననగదు అందజేశారు. రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అమడాల శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ గోపీనాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు సురేష్, రోషిరెడ్డి, పూర్ణ, రజితారాణి, ఓబులేసు, సుబహాన్, పంచాయతీ కార్యదర్శులు హరి, అన్వర్ పాల్గొన్నారు.

అవుకు: మండలానికి రెండవ విడుతలో 216 కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయని ఇన్చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా బుధవారం లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను పంపిణీ చేశారు. మెట్టుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు ఉప సర్పంచ్ మేకల వెంకటేశ్వర రెడ్డి, రామవరం సర్పంచ్ మూరబోయిన మనోహర్‌లతో కలిసి ఎంపీడీఓ నగదు అందజేశారు.

సంజామల: మండలంలో కొత్త పింఛన్లు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి కొత్తగా 145 మంజూరు కాగా ఆయాగ్రామాల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు నగదు అందజేశారు. నొస్సం గ్రామంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇంటి దగ్గరకు వెళ్లి నగదు అందజేశారు. పేరుసోములలో వైస్ ఎంపీపీ చిన్న బాబు పంపిణీ చేశారు. ముక్కమల్ల, గిద్దలూరు, కమలపూరి, వసంతాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పోచా వెంకటరామిరెడ్డి, బత్తుల రామచంద్రారెడ్డి, తులశేశ్వర్ రెడ్డి, సత్యమయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు.

డోన్ టౌన్ : కొత్తగా మంజూరైన పింఛన్లను బుధవారం ఆయా సచివాలయాల్లో కౌన్సిలర్లు, అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 9వ సచివాలయం పరిధిలోని కొండపేటలో నూతనంగా మంజూరైన 15మందికి 14,15వ వార్డుల కౌన్సిలర్లు టీఈ లక్ష్మిదేవి, సుకన్య పింఛన్ నగదు అందజేసారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దేవా, శ్యామ్, ఉషా తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు సర్పంచ్ కళావతి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు.

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అండగా నిలిచారని నగర పంచాయతీ కౌన్సిలర్లు షేక్ ముబీనా, చింతల నాగిరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు ఖాజా హుసేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వెల్ఫేర్ అసిస్టెంట్ మధు ఆధ్వర్యంలో వారు లబ్ధిదారులకు అందజేశారు. అలాగే తవిసి కొండ గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివనాగయ్య ఆధ్వర్యంలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

బనగానపల్లె : మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. బనగానపల్లె మండలానికి కొత్తగా 680 మందికి వివిధ రకాల పింఛన్లు మంజూరయ్యాయన్నారు. స్థానిక పొదుపు భవనంలో జరిగే ఈ కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి నగర్‌కు చెందిన సయ్యద్‌నూర్ అహ్మద్ బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. మృతుని భార్య బషీరున్‌కు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి అందజేశారు. వైఎస్సార్ బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

డెంగీ కేసు నమోదు

కొలిమిగుండ్ల: స్థానిక ఎస్సీ కాలనీలో డెంగీ కేసు నమోదైనట్లు మలేరియా యూనిట్ ఆఫీసన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డితో కలిసి కాలనీతో పాటు డెంగీ కేసు నమోదైన ఇంటి వద్ద తెరర్థ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కాలనీకి చెందిన జినుగు ఫక్కీర, లక్ష్మి దంపతులకు చెందిన ఏడాది చిన్నారికి జ్వరం రావడంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డెంగీ సోకినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో మలేరియా యూనిట్ ఆఫీసర్ కాలనీకి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ఇంటి పరిసరాలు, ఎస్సీ కాలనీ, గ్రామంలోనూ ఫాగింగ్ చేయించాలని ఎంపీడీఓను సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ప్రజలు అప్రత్తంగా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమల బారిన పడకుండా ప్రతిఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగ సంఘంగా ఎన్‌ఎంయూ గుర్తింపు హర్షణీయం

కోవెలకుంట్ల: ఇతర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల మాదిరిగానే ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వడం హర్షనీయమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివరాం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు డిపో ఆవరణలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు సుముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. తాజాగా ఎన్‌ఎంయూను ప్రభుత్వ గుర్తింపు సంఘంగా ప్రకటించి జీఓ 96ను విడుదలపై సంతోషం వ్యక్తం చేసిన ఆయన ఆర్టీసీ ఉద్యోగుల తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ఆచారి, ఓబులేసు, ఆదాం, కేఎస్‌పీరావు, జబ్బార్, శేషు పాల్గొన్నారు.

యాచకుడి మృత దేహానికి అంత్యక్రియలు

డోన్ టౌన్ : రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాల్లో యాచక వృత్తి చేస్తూ జీవిస్తున్న గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అన్నీతామై యాచకుడి మృత దేహానికి అంత్యక్రియలు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం స్థానిక పాతపేట హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గురుస్వామి, ఓమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని హామీని నెరవేర్చాలి

డోన్ టౌన్ : ప్రతి పక్షనేతగా ఉన్న సమయంలో మాదిగలకు ప్రధాన మంత్రి మోడీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్యమాదిగ కోరారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

శివపార్వతుల కల్యాణం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటిలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి,అమ్మవార్ల కల్యాణం ఘనంగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలారూపంలో కొలువైన శ్రీ ఉమా మహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వధువరులుగా ముస్తాబు చేసి సంప్రదాయబద్ధంగా కల్యాణం చేశారు.

ఓటర్ల జాబితాపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితాపై అఖిల పక్ష రాజకీయ నాయకులతో ఆర్డీఓ వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. పట్టణంతో పాటు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ, మార్పులు, చేర్పుల విషయంపై నాయకులతో సమీక్షించారు. ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసేందుకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సచివాలయం తనిఖీ

అవుకు : మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామ సచివాలయాన్ని బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమ్‌మెంట్, స్పందన రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సచివాలయంలో స్పందన నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, ఈఏ దుర్గా, డబ్ల్యూఏ సరేంద్ర నాయక్, డీఏ సుల్తాన్, బీఏఏ మహేంద్ర, మహిళా పోలీస్ ఉషారాణి పాల్గొన్నారు.